# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

ఆదివారం 6-8-2023





**జోహార్.. ఆచార్య..**



దివంగత ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా అసెంబ్లీ హాల్ లోని ఆయన చిత్ర పటానికి నేతలు పుష్పాంజలి ఘటించారు. ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు, సభాపతి శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు ఘన నివాళులు అర్పించారు.

# కూలిన యుద్ధనౌక

## ప్రజాగాయకుడు గద్దర్ కన్నుమూత



**ఆయనో విప్లవ కెరటం.. అన్యాయంపై గర్జించే గొంతుక.. గుండెలోతులో తుపాకీ గుండె గుచ్చుతున్నా.. ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసిన సేనాని.. గజ్జె కట్టి పాలకులను కదలించిన విప్లవోద్యమ నావ.. ఆయనే ప్రజా యుద్ధనౌక గద్దర్. అనారోగ్యంతో ఆదివారం తుదిశ్వాస విడిచారు. తెలంగాణలోనే కాదు తెలుగు ప్రజలకు ఆయన తెలియని వారంటూ లేరు. తన మాటనే పాటగా మలిచిన గొప్ప కళాకారుడు. తెలంగాణ ఉద్యమంలో తన పాట ద్వారా ఉద్యమానికి ఊపిరి పోశారు. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఆయన పాటలతో ఎంతో మందికి స్ఫూర్తి నింపారు. ఈ మధ్యనే గుండె ఆపరేషన్ చేయించుకున్నారు గద్దర్.. ఈ క్రమంలో అనారోగ్యంతో అపోలో ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయాన్ని గద్దర్ కుమారుడు సూర్యం అధికారికంగా వెల్లడించారు.**

**హైదరాబాద్, ఆగస్ట్6 (తెలుగుప్రభ)**

మెదక్ జిల్లాలోని తూప్రాన్ గ్రామంలో గద్దర్ దళిత కుటుంబంలో జన్మించారు. ఆయన అసలు పేరు గుమ్మడి విఠల్ రావు. తల్లి పేరు లచ్చమ్మ, తండ్రిపేరు శేషయ్య. నిజామాబాదు జిల్లా మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ విద్య అభ్యసించారు. 1969 తెలంగాణ ఉద్యమంలో గద్దర్ చురుగ్గా పాల్గొన్నారు. ఉద్యమ సమయంలో ఊరురా తిరిగి ప్రచారం చేశారు. ఇందుకోసం ఆయన బుర్రకథను ఎంచుకున్నారు. ఆయన ప్రదర్శనను చూసిన సినిమా దర్శకులు బి.నరసింగరావు భగత్ సింగ్ జయంతి రోజున ఒక ప్రదర్శనకు అవకాశమిచ్చారు. ఆ తర్వాత ప్రతి ఆదివారం ఆయన తన ప్రదర్శనలు ఇచ్చేవారు. 1971లో బి.నరసింగరావు ప్రోత్సాహంతో మొదటి పాట 'ఆపర రిక్షా' పాట రాశారు. ఆయన మొదటి ఆల్బం పేరు గద్దర్. ఇదే ఆయన పేరుగా స్థిరపడింది. ఈయనకు గద్దర్ అను పేరును స్వాతంత్ర్యం రాకముందు బ్రిటిష్ రాజ్యాన్ని వ్యతిరేకించిన 'గదర్ పార్టీ' కు గుర్తుగా తీసుకున్నారు.

### తొలుత..

కుటుంబ నియంత్రణ, పారిశుధ్యం వంటి అనేక సామాజిక విషయాల గురించి ఆయన బుర్రకతలను తయారు చేసుకొని ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించేవారు. ఆ తర్వాత ఆయన అనేక పాటలు రాసారు. 1972 లో జన నాట్య మండలి ఏర్పడింది. ఇది పల్లెల్లో జరుగుతున్న ఆకృత్యాలను ఎదురించేందుకు.. దళితులను మేల్కొల్పేందుకు.. చైతన్య పరిచేందుకు ఏర్పడింది. 1975లో బ్యాంకు ఉద్యోగిగా చేరి, అనంతరం విమలను వివాహం చేసుకున్నారు. ఆయనకు ముగ్గురు పిల్లలు, సూర్యుడు, చంద్రుడు ( 2003 లో అనారోగ్యంతో మరణించారు), వెన్నెల. మా భూమి సినిమాలో సాయుధ పోరాట యోధుడు యాదగిరి పాత్రలో నటించి యాదగిరి పాడిన బండెనక బండి కట్టి అనే పాటను ఆయనే పాడి, ఆడారు. దాంతో ఆయనకు ఎనలేని పేరు వచ్చింది. 1984 లో ఆయన ఉద్యోగానికి రాజీనామా చేశారు. 1985 లో కారంచేడులో దళితుల హత్యలకు వ్యతిరేకంగా పోరాడారు. 1997 ఏప్రిల్ 6 న ఆయన పై పోలీసులు విరుచుకు పడ్డారు. ఆయన శరీరంలోకి అనేక బుల్లెట్లు గుచ్చుకున్నాయి. అన్ని బుల్లెట్ లను తొలగించారు కాని ఒక్క బుల్లెట్ ను మాత్రం డాక్టర్ లు తొలగించలేదు. అది తొలగిస్తే ఆయన ప్రాణాలకే ప్రమాదమని వదిలేశారు. ఒంట్లో ఇప్పటికి బుల్లెట్ ఉంది.

### తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమంలో...

బలమైన కమ్యూనిస్ట్ భావజాలం ఉన్నప్పటికీ గద్దర్ మొదటి నుండి తెలంగాణా వాదే. మావో పార్టీ తెలంగాణాకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నప్పుడు కూడా ఆయన తెలంగాణకే మద్దతు తెలిపారు. ప్రత్యేక ఉద్యమ సమయంలో తన పాటల ద్వారా యువతను చైతన్య పరిచారు. రాష్ట్ర సాధనలో తనవంతు పాత్ర పోషించారు.

### బహుల ప్రజాదరణ

ఆయన రాసిన పాటల్లో 'అమ్మ తెలంగాణమా' అనే పాట బహుల ప్రజాదరణ పొందింది. తెలంగాణా లోని అన్ని అంశాలను స్పృశిస్తూ సాగింది ఈ పాట. ఆయన రాసిన 'నీ పాదం మీద పుట్టు మచ్చ నై చెల్లెమ్మ' అనే పాటకు ఉత్తమ గీతంగా నంది అవార్డు వచ్చింది అయితే ఆయన ఆ అవార్డ్ ను తిరస్కరించారు.



# 'ఢిల్లీ'లో లొల్లి

- అధికారుల నియంత్రణ బిల్లుకు లోక్‌సభ ఆమోదంతో కొత్త పంచాయితీ
- సమాఖ్య స్ఫూర్తికి విఘాతం
- తమకు అధికారంలేని చోట ప్రభుత్వాలను ఆగం చేస్తున్న మోడీ సర్కార్
- నెక్ట్స్ టార్గెట్ హైదరాబాదేనా?

**ఇటీవల కాలంలో అత్యంత వివాదాస్పదమైన 'ఢిల్లీ అధికారుల నియంత్రణ బిల్లు (సవరణ) బిల్, 2023' (ఎన్‌సీటీడీ)ని లోక్‌సభలో ఎట్టకేలకు మోడీ సర్కార్ నెగ్గించుకుంది. ఈ బిల్లుతో ఢిల్లీలో కొత్త పంచాయితీకి కేంద్ర ప్రభుత్వం తెరతీసింది.**

**తెలుగు ప్రభ (ఆగస్ట్ 6):**

తమకు అధికారం లేని చోట ప్రభుత్వాలను నయానో భయానో లొంగదీసుకోవడం.. అదీ వీలుకాకుంటే సీబీఐ, ఈడీలతో ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురిపెట్టి తమదారికి తెచ్చుకుంటున్న కేంద్రంలోని మోడీ సర్కారు.. దేశ రాజధానిలో ప్రజలు గెలిపించిన ప్రభుత్వాన్ని 'నామ్ కే వాస్తే' చేసేసింది. కీలకమైన ఎన్‌సీటీడీ బిల్లును ఇటీవలే పార్లమెంట్ ముందుకు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం.. విపక్షాల గొంతు నొక్కి సభలో ఉన్న మందబలంలో ఆ బిల్లును లోక్‌సభలో ఆమోదింపజేసుకుంది. సుప్రీంకోర్టు తీర్పునకు, రాజ్యాంగ సూత్రాలకు తిలోదకాలిస్తూ తీసుకొచ్చిన ఈ బిల్లు ద్వారా కేంద్ర ప్రభుత్వం సాధించేదేంటి..?

### ఏమిటీ బిల్లు..?

ఢిల్లీలో పరిపాలన సేవల (అడ్మినిస్ట్రేషన్)పై నియంత్రణకు సంబంధించిందే ఈ బిల్లు. దీని ప్రకారం.. ఢిల్లీ ముఖ్యమంత్రితో పాటు ముగ్గురు సభ్యుల అథారిటీ, దేశ రాజధానిలో అధికారుల నియామకం, బదిలీలు, వారిపై క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన వ్యవహారాలను చూసుకుంటుంది. ఈ అథారిటీ చేసిన సూచనలను లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదించాల్సి ఉంటుంది.

పరోక్షంగా ఇది ఢిల్లీ అధికారాలను కేంద్రం (లెఫ్టినెంట్ గవర్నర్ కేంద్ర చేతిలో కీలుబొమ్మే అన్నది ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన పన్లేదు) తన వద్ద ఉంచుకోవడం వంటిదే. దీనితో ఢిల్లీలో అధికారుల నియంత్రణ మొత్తం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి పోతుంది. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని 'ఆప్' మొదటి నుంచీ దీనిని వ్యతిరేకిస్తుంది. ఇది ఢిల్లీ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని, ఫెడరల్ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని వాదిస్తున్నది. మరోవైపు మోడీ సర్కారు కూడా.. ఢిల్లీ కోసం చట్టాలు చేసేందుకు అనుమతించే నిబంధనలు రాజ్యాంగంలో కేంద్రానికి కూడా ఉన్నాయని సమర్థించుకుంటోంది.

### సయోధ్య లేని చోట కొత్త సవాళ్లు..

ఢిల్లీలో ఆప్ ప్రభుత్వానికి లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) ల పంచాయితీ ఈనాటిది కాదు. 2015లో అరవింద్ కేజ్రీవాల్ అధికారంలోకి వచ్చినప్పట్నుంచి ఇప్పటిదాకా అది రావణకాష్టంలా రగులుతూనే ఉంది. ఢిల్లీలో ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, నీటి సరఫరా, విద్యకు సంబంధించిన చట్టాలలో సవరణలు చేపట్టినా దానికి ఎల్జీ కొర్రీలు పెట్టడం, వాటిని తిరిగి అసెంబ్లీకి పంపడం, విమర్శలు ప్రతివిమర్శలు సా..గు..తూ...నే ఉన్నాయి. గతంలో ఓసారి సీఎస్ విషయంలో కూడా సీఎం – ఎల్జీ మధ్య ఢీ అంటే ఢీ అన్నట్టుగా మాటలయుద్ధం సాగింది. ఇన్నాళ్లు అంతో ఇంతో అడ్డుపుల్ల వేసిన ఎల్జీ.. ఇక కొత్త బిల్లు ప్రకారం మరింత బలవంతుడవుతాడు. ఇది కేజ్రీవాల్‌కు కొత్త చిక్కులు పెట్టి ఆయనను ఇబ్బందిపెట్టేదేనని రాజకీయ విశ్లేషకుల వాదన.

### హస్తినను హస్తగతం చేసుకునేందుకేనా..?

గత రెండు సాధారణ ఎన్నికలలో దేశం మొత్తం నరేంద్ర మోడీ హవా వీచినా ఢిల్లీలో మాత్రం రెండు అసెంబ్లీ ఎన్నికలలోనూ బీజేపీ బొక్కబోర్లా పడింది. 2015లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ మూడంటే మూడు సీట్లు గెలుచుకుంది. 2020లో ఎన్నికలకు ముందు సీఏఏ–ఎన్నార్సీ ఆందోళనలు, ఢిల్లీ అల్లర్లు వంటి ఎన్ని కుయుక్తులకు పాల్పడినా బీజేపీ 8 సీట్లకే పరిమితమైంది. ఆప్ ఏకంగా 62 సీట్లను గెలుచుకుంది. వరుసగా రెండోసారి ఆప్ జయకేతనం ఎగురవేశాక కేంద్ర ప్రభుత్వం ఢిల్లీపై మరింత కక్షగట్టింది. ఇందులో భాగంగానే ఢిల్లీకి చెందిన మంత్రులు సత్యేంద్ర జైన్, విద్యా శాఖ మంత్రి మనీష్ సిసోడియాలను తీహార్ జైలులో ఊసలు లెక్కబెటిస్తోంది. ఢిల్లీ మద్యం కేసులో సీబీఐ, ఈడీలు దాఖలు చేసిన ఛార్జిషీటులో మరికొంతమంది ఆప్ ప్రముఖులు (ఈ జాబితాలో కేజ్రీవాల్ పేరూ ఉంది) కూడా ఉన్నారు. ఇవన్నీ హస్తినను తమ హస్తగతం చేసుకునేందుకు బీజేపీ అమలుచేస్తున్న రాజకీయ వ్యూహాల్లో భాగంగానే జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తగా తీసుకొచ్చిన బిల్లు దానికి కొనసాగింపు మాత్రమే..

## నెక్ట్స్ టార్గెట్ హైదరాబాదేనా..?

**ఢిల్లీ అధికారుల నియంత్రణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందిన తర్వాత ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. ఇది ఇక్కడితో ఆగదని, బీజేపీ నెక్స్ట్ టార్గెట్ భాగ్యనగరమేనని, త్వరలో దానిపై కూడా పెత్తనం చెలాయించనుందని, అందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా చేయాలని అయితే దానికంటే ముందు భాగ్యనగరాన్ని కేంద్రపాలిత ప్రాంతం చేయనున్నారన్న వాదనలు గతంలోనూ వినిపించాయి. ఇప్పుడు ఢిల్లీ అధికారాలను రాష్ట్ర ప్రభుత్వం నుంచి కత్తిరించిన కేంద్ర సర్కారు.. తర్వాత 'తెలంగాణ గుండె'ను కూడా కోయనుందా..? అన్నది చర్చనీయాంశమైంది.**

## గవర్నర్ ఆమోదం

**హైదరాబాద్, ఆగస్ట్6 (తెలుగుప్రభ)**

ఆర్టీసీ విలీనం డ్రాఫ్ట్ బిల్లుకు గవర్నర్ తమిళిసై ఆమోదం తెలిపారు. దీంతో ఆర్టీసీ వీలీన బిల్లును ఇవాళ ప్రభుత్వం సభలో ప్రవేశప్టె అవకాశం ఉంది. ఆర్టీసీ విలీన అంశంపై గవర్నర్‌తో ట్రాన్స్‌పోర్ట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఆర్టీసీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ చీఫ్ విజయ్ పుష్ప, ఆర్టీసీ ఈడీతో గవర్నర్ చర్చించారు. అధికారులతో భేటీ అనంతరం విలీనం డ్రాఫ్ట్ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపినట్లు రాజ్‌భవన్ ప్రకటన విడుదల చేసింది.

## తెలంగాణను ముంచింది కాంగ్రెస్సే

**హైదరాబాద్, ఆగస్ట్6 (తెలుగుప్రభ)**

ఉన్న తెలంగాణన ఊడగొట్టింది.. ముంచింది కాంగ్రెస్ పార్టీయేనని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ధ్వజమెత్తారు. తెలంగాణ శాసనసభలో ఆదివారం రాష్ట్ర ఆవిర్భావం, సాధించిన ప్రగతిపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా సభ్యులనుద్దేశించి మాట్లాడారు. 'ఇక్కడో విషయం స్ఫురణకు తెచ్చుకోవాలి. కాంగ్రెస్ సభ్యులు సైతం తనతో ఏకీభవిస్తారనుకుంటున్నా. తెలంగాణ రాష్ట్ర సాధన అనే విషయం 58 సంవత్సరాల సుధీర్ఘ పోరాటం. ఒకరోజుతో, ఒక నాయకుడితో వచ్చింది కాదు. ఈ సుదీర్ఘ పోరాటానికి ఆద్యులు ఎవరు ? ఉన్న తెలంగాణను ఊడగొట్టింది ఇదే కాంగ్రెస్ పార్టీ. జవహర్‌లాల్ నెహ్రూ. ఇది చరిత్ర. దీన్ని ఎవరూ కాదనలేరు. ఉన్న తెలంగాణ ఉన్నట్టే ఉంటే.. ఎప్పుడు ఎక్కడుంనో.. ఏ దిశలో ఉండునో. తొమ్మిదేళ్లలో ఇంత స్థాయికి వచ్చాం. ఎవరూ ఏం మాట్లాడినా.. ఏ రకమైనా వ్యాఖ్యలు చేసినా.. టీకా టిప్పన్ చేసినా కూడా ప్రపంచవ్యాప్తంగా ఒక రాష్ట్రం గానీ, ఒక అడ్మినిస్ట్రేషన్ యూనిట్ గానీ, దేశం గానీ పెరుగుదల ఉందా? తరుగుదలా ఉందా ? అనే దానికి కొన్ని గీటురాళ్లు ఉంటాయి' అన్నారు.

## ప్రేమికుడితో గొడవ..

## యువతి ఆత్మహత్య

**బాచుపల్లి, ఆగస్ట్6 (తెలుగుప్రభ)**

ప్రేమించిన యువకుడితో గొడవ పడిన యువతి అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్న ట్యాంకర్ కింద పడింది. ప్రమాదంలో ఆమె మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. బాచుపల్లి కి చెందిన ఓ యువతి వీఎన్‌ఆర్ కళాశాల వద్ద ప్రేమించిన వ్యక్తితో గొడవ పడింది. ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగింది. ఆ కోపంలో వాటర్ ట్యాంకర్ ను కింద పడింది. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందింది. బాచుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు..

## బీఆర్‌ఎస్‌తో కలిసి నడుస్తాం

**హైదరాబాద్,ఆగస్ట్6(తెలుగుప్రభ):**

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు పరిపాలనపై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ప్రశంసల వర్షం కురిపించారు. తొమ్మిదేళ్ల ఆయన హయాంలో రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందని కితాబిచ్చారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. అసెంబ్లీలో 'తెలంగాణరాష్ట్ర ఏర్పాటు–స్వరాష్ట్రంలో సాధించిన ప్రగతి' అంశంపై లఘుచర్చను ప్రారంభించిన అక్బరుద్దీన్, రాష్ట్రంలో కేసీఆర్ చేస్తున్న పాలనను, అభివృద్ధిని చూసి అన్ని రాష్ట్రాలు నేర్చుకోవాలని సూచించారు. తిరిగి ఆయనే ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేవారు. తమ పార్టీ కూడా బీఆర్‌ఎస్‌తోనే కలిసి పయనం కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు.